సాక్షి నిజామాబాద్

శుక్రవారం ∣ 28 ∣ జులై ∣ 2023



జూదరుల పనేనా

జక్రాన్ మండలం రైతునగర్‌లో దంపతుల హత్యకు పేకాట ఆడే వారికి ఏమైనా సంబంధం ఉందా అని పోలీసులు విచారిస్తున్నారు.

- 8లో ▸



గేట్ల ఎత్తివేత ఐదోసారి

శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ చరిత్రలో జూలైలో గేట్లు ఎత్తడం ఇది ఐదోసారని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
28.5 /23.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తాయి. పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీ బస్సులు రద్దు

ఖలీల్‌వాడి : నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు 35 రూట్‌లలో 93 బస్సులను రద్దు చేసినట్లు ఆర్‌ఎం జానీ రెడ్డి తెలిపారు. వరంగల్ మార్గంలో ఆర్మూర్ మండలం చేపూర్, జగిత్యాల జిల్లా ఇబ్రహీం పట్నం మండలం మూడుబొమ్మల మేడిపల్లి వద్ద జాతీయ రహదారిపై వరదనీరు చేరడంతో బస్సులను నిలిపివేసినట్లు తెలిపారు. కామారెడ్డి నుంచి బాన్సువాడ, కామారెడ్డి నుంచి కరీంనగర్, ఆర్మూర్ నుంచి నందిపేట్, భైంసా నుంచి నిజామాబాద్ బస్సులను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో గురువారం 28,576 కిలో మీటర్ల మేరకు బస్సులు తిరగలేదన్నారు. రూ.11,31,532 ఆదాయం ఆర్టీసీకి నష్టం వచ్చినట్లు తెలిపారు.

విద్యార్థులకు పునరావాసం



కమ్మర్‌పల్లి : భారీ వర్షంతో కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం చుట్టూ వరద నీరు చేరడంతో విద్యార్థులను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోకి తరలించారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కేజీబీవీని సందర్శించారు. విద్యార్థులకు ప్రత్యేక భోజనంతో పాటు, ప్రత్యేక అవసరాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వరద తగ్గాక విద్యార్థులను స్వస్థలాలకు పంపాలని అధికారులను ఆదేశించారు.

వరద బాధితుల తరలింపు

సుభాష్‌నగర్ : జిల్లాలో ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలతో వరద తాకిడికి లోనైన బాధిత కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి భోజన వసతి కల్పిస్తున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో 76 కుటుంబాలకు చెందిన 273 మంది సభ్యులు పునరావాస కేంద్రాల్లో వసతి పొందుతున్నారని వివరించారు.

కంట్రోల్ రూమ్‌లకు సమాచారమివ్వాలి

సుభాష్‌నగర్ : వర్షాలతో ఇబ్బందులు ఏర్పడితే కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు కోరారు. ఇప్పటికే కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సమాచారం అందించిన వెంటనే వర్షాల తాకిడికి లోనైన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా ఆయా శాఖల అధికారులు, సిబ్బందిని ఇప్పటికే అప్రమత్తం చేశామని కలెక్టర్ తెలిపారు.

కంట్రోల్ రూమ్ నంబర్లు

కలెక్టరేట్ :	08462-220183
నిజామాబాద్ కార్పొరేషన్:	08462-221001
సర్కిల్ (1):	96182 10052
సర్కిల్ (2):	73966 33773
సర్కిల్ (3):	95500 23324
సర్కిల్ (4ఎ):	78159 57095
సర్కిల్ (4బి):	85550 62383
సర్కిల్ (5) :	90101 55505

వరద ప్రాంతాల పరిశీలన



వేల్పూర్: వరద తాకిడి ప్రాంతాల ను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి గురువారం వేకువ జామున పరిశీలించారు. వేల్పూర్‌లో ప్రధాన రహదారిని ఆనుకొని ప్రవహించిన మర్సుకుంట వరదనీరు, లక్కోర వద్ద 63వజాతీయ రహదారి వద్ద ప్రమాదకరంగా ప్రవహిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

సుభాష్‌నగర్ : వానలతో జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై మంత్రి ప్రశాంత్ రెడ్డి ఫోన్ ద్వారా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో సమీక్షించారు. పరిస్థితి అదుపులోనే ఉందని, ఎక్కడ అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని కలెక్టర్ మంత్రి దృష్టికి తెచ్చారు. జిల్లా కేంద్రం సమీపంలో నిజాంసాగర్ కెనాల్‌పై నివాసాలు ఏర్పరుచుకున్న కుటుంబాలను తరలించాలని ఆదేశించారు.

ఇళ్లల్లో నుంచి బయటికి రావొద్దు

మరో రెండు రోజులు వర్షాలు ఉన్నందునా ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటికి రావొద్దని మంత్రి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. చెరువులు, వాగులు, కుంటల వద్దకు చేపల పట్టేందుకు వెళ్లొద్దని సూచించారు.

మంత్రితో ఫోన్‌లో మాట్లాడిన సీఎం

భీమ్‌గల్: వర్షాల నేపథ్యంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డికి గురువారం సీఎం కేసీఆర్ ఫోన్ చేసి జిల్లాలో పరిస్థితులపై ఆరా తీశారు. ప్రజల మధ్య ఉండాలని సూచించారు. మంత్రి భీమ్‌గల్‌లో వరద పరిస్థితి పరిశీలించారు.



వాన బీభత్సం..

నగరంలోని న్యాల్‌కల్ రోడ్డు రోటరీనగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు



తెగిపోయిన తొండాకూర్ - ఖుద్వాన్‌పూర్ రోడ్డు



కందకుర్తి వద్ద నీట మునిగిన శివాలయం



అలీసాగర్ మూడు గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీరు



జానకంపేటలో ఇంట్లోకి చేరిన వర్షం నీరు, బాల్కొండలో..



వరద నీటిలో సిరికొండ సబ్‌స్టేషన్



ఆర్మూర్ మండలం చేపూర్ శివారులో నీట మునిగిన పంట పొలాలు

- పొంగిపొర్లుతున్న చెరువులు.. తెగిపోయిన రోడ్లు.. రాకపోకలకు అంతరాయం
- నందిపేట మండలం ఖుద్వాన్‌పూర్‌లో వరద నీటిలో ఒకరు గల్లంతు
- భీమ్‌గల్ మండలంలో జేసీబీ ద్వారా గర్భిణి ఆస్పత్రికి తరలింపు
- జిల్లాలో 21,500 ఎకరాల్లో పంటల నష్టం
- నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ పట్టణాల్లో కాలనీలు జలమయం
- 7 ప్రాంతాల్లో 273 మంది వరద బాధితులు శిబిరాలకు తరలింపు
- రహదారులపైకి భారీగా వరద నీరు.. గ్రామీణ ప్రాంతాల్లో కోతకు గురైన పలు రోడ్లు
- నిండుకుండలా శ్రీరాంసాగర్ జలాశయం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : మూడ్రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షం జిల్లాను అతలాకుతలం చేస్తోంది.

■ జిల్లాలోని ఏర్గట్ల మండలంలో 16 సెంటీమీటర్లు, కమ్మర్‌పల్లి మండలంలో 15సెం.మీ, మోర్తాడ్ మండలం 14సెం.మీ, భీంగల్ మండలం 13సెం.మీ, బాల్కొండ మండలం 12సెం.మీ, వేల్పూర్ మండలంలో 11 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

■ జిల్లాలోని మొత్తం 1,086 చెరువులకు గాను 934 చెరువులు అలుగు పారుతున్నాయి. 8 చెరువుల కట్టలు తెగాయి. వివిధ మండలాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. లోలెవల్ వంతెనలు మునిగిపోయాయి. వివిధ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు గ్రామాల్లో ఇళ్లు కూలిపోయాయి.

■ భీమ్‌గల్ మండలం పిప్రి–బాచన్‌పల్లి గ్రామాల మధ్య చెరువు కట్ట తెగిపోవడంతో రాకపోకలు నిలిచాయి. పిప్రి గ్రామానికి చెందిన గర్భిణిని జేసీబీ ద్వారా ఆయా గ్రామాలు దాటించి అంబులెన్స్‌లో ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు.

■ నందిపేట మండలం ఖుద్వాన్‌పూర్ చెరువు అలుగు వద్ద చేపల కోసం వెళ్లిన కొల్బూర్ గ్రామానికి చెందిన పోచమ్మల ఎల్లప్ప(35) గల్లంతయ్యాడు.

■ జిల్లా వ్యాప్తంగా 15,271 మంది రైతులకు చెందిన 21,500 ఎకరాల వరి, సోయా, మొక్కజొన్న, పసుపు పంటలు దెబ్బతిన్నాయి.

■ నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ పట్టణాల్లోని పలు కాలనీలు జలమయం అయ్యాయి. జిల్లాలోని 7 ప్రాంతాల్లో 76 కుటుంబాలకు చెందిన 273 మంది వరద బాధితులను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు.

■ శ్రీరాంసాగర్ జలాశయంలోకి గురువారం సాయంత్రానికి 79 టీఎంసీల నీరు చేరింది. ఎగువ మహారాష్ట్ర నుంచి ఇన్‌ఫ్లో 2,21,000 క్యూసెక్కులు ఉండగా 26 గేట్లు ఎత్తి 1,50,000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

■ బోధన్ పట్టణంలోని వెంకటేశ్వర్ కాలనీ, సరస్వతినగర్, రాకాసిపేట కాలనీలు జలమయమయ్యాయి. పోతంగల్ మండలం సోంపూర్. సాలూర మండలం హుంసా గ్రామాల మధ్య వాగు పొంగి వరద నీరు ప్రవహిస్తోంది. రెవెన్యూ అధికారులు రాకపోకలు నిలిపేశారు. రుద్రూర్–బొప్పాపూర్ గ్రామాల మధ్య వాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వర్ని మండలం జలాల్‌పూర్ చెరువు నీరు ప్రధాన రోడ్లపై పారింది. కోకల్‌దాస్ తాండ వద్ద వర్షం నీరు రోడ్డుపై పారడంతో బడాపహాడ్ దర్గాకు రాకపోకలు ఆగిపోయాయి.

■ ఎడపల్లి మండలంలోని అలీసాగర్ నిండడంతో మూడు గేట్లు ఎత్తి నీటిని వదిలారు.

■ తాణాకలాన్‌లో మూడు పెంకుటిళ్లు. రుద్రూర్ మండలం బొప్పాపూర్, చిక్కడపల్లి, రాయకూర్‌లలో రెండు చొప్పున ఇళ్లు కూలిపోయాయి. చందూర్, పాత వర్ని గ్రామాల్లో ఇళ్లు కూలిపోయాయి.

■ ఆర్మూర్‌లోని హుస్నాబాద్ కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, యోగేశ్వర కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, కేటీఎస్ పాఠశాల జలమయమయ్యాయి. ఆర్మూర్ నుంచి ఆలూరు వెళ్లే బైపాస్ రోడ్డు మీద నుంచి వరద పారడంతో రహదారి మూసేశారు. ఆర్మూర్ మండలంలో చేపూర్ పెద్దకుంట వాగు పొంగడంతో 63వ నంబర్ జాతీయ రహదారిపై నుంచి నీరు పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మిర్ధపల్లి నుంచి దేగాం, పిప్రి నుంచి మంథని వెళ్లే మార్గాలు వరదనీటితో దెబ్బతిన్నాయి.

■ మాక్లూర్ మండలం చిక్లి, మాందాపూర్, ధర్మోరా, వల్లభాపూర్‌లలో పొలాలు మునిగాయి. మాణిక్‌భండార్ వద్ద చెరువుకు గండి పడి 63వ నంబర్ జాతీయ రహదారి మునిగిపోయింది.

■ ధర్పల్లి మండలంలో పలు వాగులు పొంగడంతో ధర్పల్లి, ఇందల్వాయి, రామడుగు, కేశారం, ధర్పల్లి నుంచి బెల్యాతండాకు వెళ్లే రోడ్లను అధికారులు మూసివేశారు. రామడుగు ప్రాజెక్టు జలాశయం అలుగు నుంచి భారీగా నీరు పారుతోంది. డిచ్‌పల్లి మండలం యానంపల్లి, సుద్దులం రోడ్డుపై లోలెవెల్ వంతెన మునగడంతో అధికారులు రోడ్డును మూసేశారు.

■ నిజామాబాద్ నగరంలోని పలు లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగాయి. మున్సిపల్ సిబ్బంది సహాయక కార్యక్రమాలు చేపట్టారు. వినాయక్‌నగర్‌లోని సబ్‌స్టేషన్ నీటమునిగింది. మాజీ మేయర్ ఇంటి వైపు ఉన్న పులాంగ్ లోలెవల్ వంతెన మీద నుంచి వరద పారింది.



కులాస్‌పూర్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో



మానిక్‌భండార్ వద్ద ప్రధాన రహదారిపై వర్షపు నీరు



వేల్పూర్ చెక్‌డ్యాం పైనుంచి పారుతున్న వరద నీరు



నగరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బిగాల, మున్సిపల్ కమిషనర్



మానిక్‌భండార్ వద్ద వరద నీటిని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

చెరువుల్లోకి చేరిన నీటి వివరాలు..

నియోజకవర్గం	మొత్తం చెరువులు	నిండినవి 70%	నిండినవి 100%	అలుగు పారుతున్నవి
నిజామాబాద్	324	17	31	276
బోధన్	182	--	5	177
ఆర్మూర్	198	2	48	148
బాల్కొండ	292	2	5	285
బాన్సువాడ	90	10	32	48
మొత్తం	1,086	31	121	934

పంట నష్టం వివరాలు..

పంట	రైతులు	నష్టం (ఎకరాల్లో)
వరి	7,373	10,913
సోయాబీన్	2,835	4,189
మొక్కజొన్న	4,183	5,193
పసుపు	880	1,205
మొత్తం	15,271	21,500



గూపన్‌పల్లిలో పునరావాసం పొందుతున్న వరద బాధితులు

నిలిచిపోయిన రాకపోకలు

■ మోపాల్ మండలంలో మంచిప్ప చెరువు అలుగు పారుతోంది. జక్రాన్‌పల్లి మండలంలో పడకల్ చెరువు పూర్తిగా నిండడంతో గ్రామస్తులు ముందు జాగ్రత్తగా పొక్లెయినర్ సహాయంతో అలుగు తవ్వేశారు. ఇందల్వాయి మండలం సిర్నాపల్లి గ్రామ శివారులోని లోలెవెల్ వంతెన మునగడంతో రాకపోకలు నిలిచాయి. లింగాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ధర్పల్లి –ఇందల్వాయికి రాకపోకలు నిలిచిపోయాయి. దుబ్బ నుంచి ఖానాపూర్ వెళ్లే రోడ్డుపై భారీగా నీరు పారుతుండడంతో అధికారులు రోడ్డును మూసేశారు.

■ గూపన్‌పల్లి వాగు ఉధృతంగా పారుతుండడంతో అక్కడివారిని పునరావాస శిబిరానికి అధికారులు తరలించారు.

క్లుప్తంగా

మండలాల్లో కురిసిన వర్షపాతం వివరాలు

మండలాలు	వర్షపాతం(మి.మీటర్లలో)
వేల్పూర్	105.5
నవీపేట	86.3
భీమ్‌గల్	124.9
డిచ్‌పల్లి	60.0
జక్రాన్‌పల్లి	81.1
మోర్తాడ్	133.4
కోటగిరి	53.0
వర్ని	48.3
డొంకేశ్వర్	76.5
బాల్కొండ	119.4
నందిపేట	64.3
కమ్మర్‌పల్లి	143.0
ఏర్గట్ల	159.3
రెంజల్	59.0
ఆలూరు	85.3
మాక్లూర్	64.3
పోతంగల్	42.5
సిరికొండ	75.2
ఇందల్వాయి	51.2
బోధన్	46.4
ధర్పల్లి	69.0
ఆర్మూర్	74.3
మెండోరా	123.7
ఎడపల్లి	48.4
చందూరు	42.5
సాలూర	45.3
రుద్రూరు	46.8
ముప్కాల్	103.7
నిజామాబాద్ నార్త్	50.6
నిజామాబాద్‌రూరల్	49.0
మోస్రా	50.6
మోపాల్	43.8
నిజామాబాద్ సౌత్	40.8

ఉచితంగా దంత వైద్య పరీక్షలు



నిజామాబాద్ సిటీ: నగరంలోని శీను నాయక్ ఆస్పత్రిలో గురువారం ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత వైద్య ఆస్పత్రి ఏర్పాటు చేసి 22 ఏళ్లు పూర్తయిన సందర్భంగా డాక్టర్ శీనునాయక్ ఆధ్వర్యంలో 60 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, పేస్ట్, బ్రష్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సమీర్, సంజయ్, కావేరి, తేజు, మేనేజర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి

సుభాష్ నగర్: జిల్లాలో వివిధ మండలాల్లో తహసీల్దార్లుగా విధులు నిర్వహిస్తున్న నలుగురికి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాకు చెందిన శ్రీధర్, రాజేందర్, బావయ్య, సుదర్శన్ పదోన్నతి పొందారు.

ఏకధాటి వాన



దుబ్బ నుంచి బైపాస్‌కు వెళ్లే దారిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

జిల్లావ్యాప్తంగా గత 4రోజులుగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం కురిసిన భీకర వానకు జిల్లాలోని పలు మండలాల్లో చెరువులు, కుంటలు వరద నీటితో ఉధృతంగా ప్రవహించాయి. దీంతో పలు గ్రామాలకు వెళ్లే రహదారులు కోతకు గురయ్యాయి. కొన్నిచోట్ల రహదారులపైనుంచి వరద ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. ఆయా మండలాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

–సాక్షి నెట్‌వర్క్




నందిపేట మండలం ఉమ్మెడ శివారులోని గోదావరి నీటిలో మునిగిన ఉమామహేశ్వర ఆలయం.. ముప్కాల్ మండలం రెంజర్లలో జలమయమైన పంటలు





మోతె వద్ద వంతెనను ఆనుకొని ప్రవహిస్తున్న కప్పలవాగు.. గడ్కోల్ వద్ద సోయా చేనులో కొట్టుకుపోయిన డ్రిప్.. హుస్సేన్‌నగర్‌లో నీటమునిగిన పొలాలు





ధర్పల్లి వాడి వద్ద వంతెన పైనుంచి ప్రవహిస్తున్న నీరు.. వంతెనపైనుంచి పారుతున్న లింగాపూర్ వాగు.. కుద్వాన్‌పూర్, తొండకూర్ గ్రామాల మధ్య తెగిన రోడ్డు



ఆనకట్టకు భారీగా తాకుతున్న నీటి అలలు

ఎస్సారెస్పీలో భారీ అలలు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు నీటి అలలు భారీగా తాకుతున్నాయి. గత రెండు రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద నీరువచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం వేగంగా పెరుగుతుంది. ఈదురు గాలులు బలంగా వీస్తుండటంతో ప్రాజెక్ట్ నీరు ఆనకట్ట రివిట్‌మెంట్‌కు బలంగా తాకుతుంది. సముద్రపు అలలు మాదిరిగా నీరు పైకి దూకుతుంది. ఆనకట్ట రివిట్‌మెంట్ బలంగా ఉండటంతో ఎలాంటి ప్రమాదం జరిగే అవకాశం లేదని ప్రాజెక్ట్ అధికారులు అన్నారు. ప్రాజెక్ట్ ఆనకట్టపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రాజెక్ట్ నుంచి గోదావరిలోకి నీటి విడుదల చేపడుతుండటంతో ప్రాజెక్ట్ సందర్శనకు పర్యాటకులు తరలివస్తున్నారు.

జూలైలో గేట్ల ఎత్తివేత ఐదోసారి

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద పోటెత్తడంతో అధికారులు వరద గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం మెండోరా ఎంపీపీ సుకన్య, సర్పంచ్ మిస్బా వరద గేట్ల ద్వారా నీటి విడుదలను చేపట్టారు. ప్రాజెక్టు చరిత్రలో జూలైలో గేట్లు ఎత్తడం ఇది ఐదోసారి. 1983, 2016లో, 2018లో 2022 సంవత్సరాల్లో జూలైలో గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదిలారు. ఎస్సారెస్పీలోకి ఎగువ నుంచి భారీ వరద వచ్చి చేరుతుండటం, రానున్న రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ప్రాజెక్ట్ అధికారులు ముందుగానే గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. మొదట 8 గేట్ల ద్వారా 20,800 క్యూసెక్కులు దిగువకు వదిలిన అధికారులు తర్వాత నీటి విడుదలను పెంచారు. 26 గేట్ల ద్వారా లక్ష క్యూసెక్కులకు గోదావరిలోకి వదులుతున్నారు. ఎగువ నుంచి భారీ వరద వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తుగానే గోదావరిలోకి నీటి విడుదలను చేపట్టినట్లు ప్రాజెక్ట్ ఎస్‌ఈ శ్రీనివాస్ తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90టీఎంసీలు) కాగా గురువారం రాత్రికి 1088.50(78 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

విద్యుదుత్పత్తి ప్రారంభం



విద్యుదుత్పత్తిని ప్రారంభిస్తున్న జెన్‌కో అధికారులు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద గల విద్యుదుత్పత్తి కేంద్రంలో గురువారం కరెంట్ ఉత్పత్తిని జెన్‌కో అధికారులు ప్రారంభించారు. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేపడితే ఉత్పత్తి ప్రారంభించవచ్చు. ఎస్కేప్ గేట్ల ద్వారా కాకతీయ కాలువ నీటిని గోదావరిలోకి మళ్లించి విద్యుదుత్పత్తి చేపట్టారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండటంతో నాలుగు టర్బయిన్‌ల ద్వారా 35 మెగావాట్లు ఉత్పత్తి చేస్తున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు.





భారీ వరద ప్రవహించడంతో మూసివేసిన కాలూర్ రోడ్డు.. విఠలేశ్వర కాలనీలో నీట మునిగిన ఇళ్లు.. మారంపల్లిలో చేపతో యువకుడు



కేశాపూర్‌లో చెరువును తలపిస్తున్న పొలాలు




నగరంలోని బోధన్ రోడ్డులో ఇరువైపులా నిలిచిన వర్షపునీరు

వర్షానికి కూలిన ఇళ్లు




హుస్నాబాద్ కాలనీలో కూలిపోయిన ఇల్లు.. హుస్సేన్‌నగర్‌లో..

ఆర్మూర్‌టౌన్/రుద్రూర్/సిరికొండ/నిజామాబాద్ రూరల్: జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శిథిలావస్థకు చేరిన కొన్ని ఇళ్లు కూలిపోగా, మరికొన్ని ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆర్మూర్‌లో, రుద్రూర్, కోటగిరి, పోతంగల్, నిజామాబాద్ రూరల్, సిరికొండ మండలంతోపాటు ఇతర మండలాల్లో గురువారం సుమారు 13 ఇళ్లు కూలిపోయాయి. కూలిన, దెబ్బతిన్న ఇళ్లను స్థానిక అధికారులు పరిశీలించి, వివరాలు సేకరించారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇళ్లు కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.



రాణాకలాన్‌లో..



పాత వర్నిలో..



బోధన్ పట్టణంలో..

క్రైం కార్నర్

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కోనారెడ్డి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలకేంద్రంలోని జాతీయ రహదారి 161పై ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నాందేడ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇన్నోవా కారు గురువారం ఉదయం పెద్దకొడప్‌గల్ సమీపంలోని జాతీయ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో కారులో ఉన్న ఇద్దరిని బయటకు తీశారు. వారిలో షేక్ ముస్తాక్(24) మృతిచెందగా, అబ్దుల్ అర్బజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి అజిమోద్దిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడి గల్లంతు



ఎల్లప్ప

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని కౌల్పూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి, గల్లంతయ్యాడు. వివరాలు ఇలా.. మండలంలోని కౌల్పూర్ గ్రామానికి చెందిన పోచమ్మల ఎల్లప్ప(35) గురువారం అదే గ్రామానికి చెందిన మిగతా ఐదుగురితో కలిసి షాపూర్ శివారులో గల కుద్వాన్‌పూర్ చెరువు అలుగు దగ్గర చేపలు పట్టేందుకు వెళ్లారు. ఎల్లప్పతో పాటు మరో వ్యక్తి దుర్గయ్య అలుగులోకి దిగగా, ప్రవాహం ఉధృతంగా ఉండడంతో బయటకు వచ్చే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో ఎల్లప్ప గల్లంతవ్వగా, తనతో పాటు దిగిన వ్యక్తి ప్రవాహంలో కొద్దిదూరం కొట్టుకుపోయి ప్రాణాలతో బయటపడ్డాడని స్థానికులు తెలిపారు. ఘటన స్థలాన్ని తహసీల్దార్ అనిల్ కుమార్, ఏఎస్సై వెంకటేశ్వర్లు సందర్శించి, గాలింపు చర్యలు చేపట్టారు.

భార్యాభర్తలకు పాముకాటు

- సకాలంలో ఆస్పత్రిలో చేరిక
- తప్పిన ప్రాణాపాయం



చికిత్స పొందుతున్న ముద్రిచ్చ నీలా

రాజంపేట: మండలంలోని శేర్‌శంకర్‌తండాకు చెందిన భార్యభర్తలు ముద్రిచ్చ రమేష్, నీలాలు బుధవారం అర్ధరాత్రి పాముకాటుకు గురయ్యారు. దీంతో అప్రమత్తమైన భార్యభర్తలు వారి సొంత వాహనంలో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలివెళ్లారు. సమయానికి ఆస్పత్రికి చేరడంతో వైద్యులు వారికి మెరుగైన చికిత్స అందించి వారి ప్రాణాలను కాపాడారు. ప్రసుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపినట్లు తండావాసులు పేర్కొన్నారు.

గొర్రెల మందపై చిరుతపులి దాడి

- మూడు గొర్రెలు మృతి, ఒకదానికి గాయాలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని కాటేపల్లి గ్రామ శివారులో గొర్రెల మందపై చిరుత దాడి చేయగా, మూడు గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల యజమాని బాగన్న తెలిపిన వివరాలు ఇలా.. కాటేపల్లి గ్రామ బృహత్ పల్లె ప్రకృతి వనం సమీపంలో గురువారం మధ్యాహ్నం గొర్రెలమందపై చిరుతపులి దాడి చేసింది. దీంతో కాటేపల్లి తండాకు చెందిన కిషన్, పంతిలాల్, జత్తుల ఒక్కో గొర్రె మృతి చెందింది. భాగన్న గొర్రెకు గాయలు అయ్యాయి. అటవీశాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.

దంపతుల హత్య జూదరుల పనేనా..?

- పేకాటను నియంత్రించడంలో.. పోలీసుల వైఫల్యం
- జూదం అడ్డాల లొకేషన్ పంపినా పట్టించుకోని వైనం
- రైతునగర్‌లో జంట హత్యలకు గల కారణాలపై అనుమానాలు

బాన్సువాడ: బాన్సువాడ ప్రాంతంలో జోరుగా పేకాట అడ్డాలు వెలుస్తున్నాయి. ఊరికో అడ్డాను ఏర్పాటు చేసుకుని జోరుగా పేకాటాడుతున్నారు. పేకాటను నియంత్రించడంలో పోలీసులు ఎందుకంతా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ప్రజలు చర్చించుకుంటున్నారు. రెండు రోజుల క్రితం బీర్కూర్ మండలం రైతునగర్‌లో జరిగిన వృద్ధ దంపతుల హత్యకు పేకాటరాయుళ్లకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. గతంలో పేకాట స్థావరాల లొకేషన్‌ను పోలీసులకు పంపినా స్థావరాలపై దాడులు చేసేందుకు పోలీసులు వెనుకడుగు ఎందుకు వేశారనే చర్చ జరుగుతోంది. బాన్సువాడ, బీర్కూర్, నస్రూల్లాబాద్ మండలాల్లో పేకాట అడ్డాలు జోరుగా కొనసాగుతున్నాయి. బీర్కూర్ మండలంలో ఊరికో పేకాట అడ్డాను ఏర్పాటు చేసుకుని పేకాటను నిర్వహిస్తున్నారు. మండలంలోని ఓ క్యాంపు, కిష్టాపూర్, దామరంచ, బీర్కూర్ మంజీర పరివాక ప్రాంతాల్లో, మిర్జాపూర్ చెరువు కట్ట, నస్రూల్లాబాద్ మండలం కంపల గండి, బొమ్మన్‌దేవ్‌పల్లి, నెమ్లి, దుర్కి శివారు, బోప్పాస్‌పల్లి, బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ రోడ్డులో, బోధన్ రోడ్డు బస్‌డిపో సమీపంలో, ముదెల్లి అటవీప్రాంతం, ఇబ్రహీంపేట్ తాండ, చింతల్‌నాగారం శివారులో, ఎర్రమన్ను కుచ్చ తదితర ప్రాంతాల్లో పేకాట స్థావరాల్లో పేకాట జోరుగా కొనసాగుతుంది. బీర్కూర్ మండలంలో కొనసాగుతున్న పేకాట అడ్డాల లొకేషన్‌ను కొందరు పోలీసులకు షేర్ చేసిన దాడులు చేసేందుకు వెనుకడుగు వేశారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో పేకాట రాయుళ్లు మరి రెచ్చిపోయి పేకాట ఆడుతున్నారు. బాన్సువాడలో ఓ కానిస్టేబుల్ అన్ని తానై పేకాట అడ్డాను నడిపే నిర్వాహకులకు సహకరిస్తున్నట్లు సమాచారం. బాన్సువాడ నుంచి నిత్యం పదుల సంఖ్యలో పేకాట రాయుళ్ల దెగ్లూర్, నాందేడ్ తదితర ప్రాంతాలకు వెళ్లి పేకాట ఆడుతున్నారు.

వృద్ధ దంపతులను..

రెండు రోజుల కిత్రం బీర్కూర్ మండలంలోని రైతునగర్ గ్రామంలో వృద్ధ దంపతులు నారాయణ, సులోచన దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ దంపతులకు ఎవరూ లేరు. రైతునగర్‌లో ఓ కిరాణా షాప్ నడుపుతున్నారు. వారి వద్ద ఉన్న డబ్బులను వడ్డీలకు ఇచ్చుకునేవారు. నారాయణ వద్ద ఎక్కువగా వడ్డీలకు తీసుకెళ్లేది పేకాటరాయుళ్లేనని తెలిసింది. ఈరోజు రూ.9 వేలు వడ్డీకి ఇస్తే మరుసటి రోజు వడ్డీతో కలిపి రూ.10 వేలు చెల్లించేలా ప్రామిసరీ నోటు రాసుకుని డబ్బులు ఇచ్చేవారని సమాచారం. ఇలా చాలా మందికి రూ. లక్షల్లో వడ్డీకీ డబ్బులు ఇచ్చినట్లు తెలిసింది. వడ్డీకి తీసుకున్న వారు తిరిగి చెల్లించడంలో ఆలస్యం కావడంతో వారిని నారాయణ నిలదీసినట్లు తెలిసింది. వడ్డీకీ డబ్బులు తీసుకున్న వారెవరైన దంపతులను హత్య చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హత్య చేసిన దండుగులు వారి వద్ద ఉన్న బంగారంతో పాటు నగదును దోచుకెళ్లినట్లు సమాచారం. అసలు వృద్ధ దంపతుల వద్ద ఉన్న బంగారమెంతా.. నగదు ఎంతా అనే విషయంపై స్థానికులు చర్చించుకుంటున్నారు. పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకునివిచారిస్తున్నట్లు తెలిసింది.

ఉరి వేసుకుని కానిస్టేబుల్ ఆత్మహత్య



నరేష్‌రెడ్డి (ఫైల్)

కామారెడ్డి క్రైం: ఉరి వేసుకుని ఓ ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గురువారం ఉదయం వెలుగు చూసింది. వివరాలు ఇలా.. రాజంపేట మండలం బస్వన్నపల్లి గ్రామానికి చెందిన ఏలేటి నరేష్ రెడ్డి (30) ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య వర్షిణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాలుగేళ్ల క్రితం సొంత ఇల్లు కట్టుకుని కామారెడ్డిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో స్థిరపడ్డాడు. ప్రస్తుతం అతడు జిల్లా పోలీసు కార్యాలయంలో పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి నరేష్‌రెడ్డి కొక్కానికి వైర్‌తో ఉరి వేసుకున్నాడు. కడుపునొప్పి కారణంగా తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌ఓ నరేష్ తెలిపారు.

నాడు కూతురు మృతి.. నేడు కొడుకు ఆత్మహత్య

నరేశ్‌రెడ్డి మృతివార్త సొంతూరులోని అతడి తల్లిదండ్రులు మహిపాల్‌రెడ్డి, రాధ విని కుప్పకూలిపోయారు. 2005లో వారి కూతురు జయంతి అనుమానాస్పద స్థితిలో చనిపోయింది. ఆమె కబడ్డీ క్రీడాకారిణిగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. పెళ్లయిన కొంత కాలానికే ఆమె అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. అప్పుడు ఎదిగిన కూతురు, ఇప్పు డు ఎదిగిన కొడుకు చనిపోవడంతో ఆ తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలింది.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఉన్నతాధికారులు

రాజంపేట : నరేష్‌రెడ్డి అంత్యక్రియల్లో ఓఎస్డీ ఎస్పీ అన్యోన్య, ఆర్‌ఐలు, ఎస్సైలు, రాజంపేట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. గురువారం మధ్యాహ్నం బస్వన్నపల్లికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు.

పోలీసుల అదుపులో చోరీలకు పాల్పడిన వ్యక్తి!

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంతోపాటు, చుట్టుపక్కల ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పట్టణ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం కామారెడ్డిలోని గాంధీనగర్‌లోగల రెండు ఆలయాల్లో చోరీలు జరిగాయి. దొంగలు ఎవరనేది గుర్తించడం కోసం పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. గురువారం వేకువజామున సమయంలో మరో ఆలయం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ పాత నేరస్తుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. జిల్లాకేంద్రానికి చెందిన అతడు కొద్ది రోజులుగా మాచారెడ్డి చౌరస్తాలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల జరిగిన చోరీలు చేసింది తానేనని అంగీకరించినట్లు తెలుస్తోంది.

ఇంటర్‌నెట్ సేవలు పునరుద్ధరణ

సుభాష్‌నగర్: నగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రెండ్రోజులుగా నిలిచిన ఇంటర్నెట్ సేవలు గురువారం సాయంత్రం పునరుద్ధరించబడ్డాయి. ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో సర్వర్ డౌన్ అయి సుమారు 45 వరకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాలేదు. కార్యాలయానికి సంబంధించి ఇంటర్నెట్ తీగలు తెగిపోవడంతో సమస్య వచ్చిందని అధికారులు పేర్కొంటున్నారు. సమస్యను గుర్తించి, వేరే చోటు నుంచి నూతనంగా ఇంటర్నెట్ తీగలు తీసుకుని సేవలను ప్రారంభించామని వారు తెలిపారు. రెండ్రోజులపాటు రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తంచేశారు